సాక్షి
పార్వతీపురం మన్యం
ఆదివారం । 1 । జూన్ । 2025



అడ్డుకట్ట వేయాలి
మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నిఘా పెంచాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. - 8లో



పశువుల అక్రమ రవాణాపై నిఘా పెట్టాలి
పశువుల అక్రమ రవాణాపై అధికారులు నిఘా పెట్టి కేసులు నమోదు చేయాలని విజయనగరం ఆర్డీవో టి.సవరమ్మ ఆదేశించారు. - 8లో



'గురుదేవా'లో చోరీ ఇంటిదొంగల పనేనా..? - 8లో
మంగళపాలెం గురుదేవా చారిటిబుల్ ట్రస్టు చైర్మన్ రావర్తి జగదీషబాబు ఇంట్లో చోరీ చేసినది ఇంటిదొంగలేనని పోలీసులు అనుమానిస్తున్నారు.

న్యూస్‌రీల్

43 అట్రాసిటీ కేసుల్లో పరిహారం చెల్లింపు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: జిల్లాలో నమోదైన 43 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు రూ.48.42 లక్షలు నష్ట పరిహారంగా చెల్లించినట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మరో 40 కేసులకు సంబంధించి రూ.54.50 లక్షల చెల్లింపు పెండింగ్‌లో ఉందని, ఆరు కేసుల్లో విచారణ కొనసాగుతోందని వివరించారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే అన్ని వసతి గృహాలు, పాఠశాలలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మొదటిరోజు నుంచే విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి తగిన పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు కులధ్రువీకరణ పత్రం జారీకి ఆదేశాలు జారీచేశామన్నారు. ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో భూ సంబంధిత వ్యవహారాల్లో ఏర్పడిన వివాదాల కారణంగా ఎస్సీ, ఎస్టీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు. భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తే కేసులకు ముగింపు పలకవచ్చని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలో జిల్లా స్థాయి అధికారులను సభ్యులుగా నియమించాలని కోరారు. కులాన్ని అడ్డంగా పెట్టుకుని కేసులకు వాడుకోవడం సరికాదని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్వో కె.హేమలత, ఏఎస్పీ అంకిత సురాన, పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎండీ గయాజుద్దీన్, జలవనరుల కార్యనిర్వాహక ఇంజినీరు ఆర్. అప్పలనాయుడు, వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.వినోద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భయం..భయం



గొట్టివలసలో సంచరిస్తున్న ఏనుగులు

గరుగుబిల్లి: ఏనుగుల సంచారంతో గరుగుబిల్లి మండలంలోని నందివానివలస, సుంకి, సంతోషపురం, గొట్టివలస గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రోడ్లపైన, గ్రామానికి సమీపంలో సంచరిస్తుండడంతో ఎప్పుడు ఏ ముప్పు తలపెడుతాయోనని భయపడుతున్నారు. తక్షణమే ఏనుగుల తరలింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పదోతరగతి పరీక్షల మూల్యాంకనంలో ప్రభుత్వం విఫలం

- ప్రభుత్వ తొందరపాటు చర్యలతో వేలమంది జీవితాలపై తీవ్ర ప్రభావం
- రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌లో మార్కుల్లో భారీ వ్యత్యాసాలు
- విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయుకులు, సభ్యులు

విజయనగరం గంటస్తంభం: విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని, విద్యారంగాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు దుయ్యబట్టారు. అమర్ భవన్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగభూషణం మాట్లాడారు. పదోతరగతి పరీక్ష ఫలితాలు ఏప్రిల్ 23న విడుదల చేశారు. ఎన్నడూలేని విధంగా పరీక్షలు పూర్తయిన 22 రోజులకే ఫలితాలు విడుదల చేశామని విద్యాశాఖమంత్రి గొప్పలు చెప్పుకున్నారు. తీరా ఈ ఫలితాల్లో చాలామంది విద్యార్థులు అసహనం చెందడంతో పాటు మార్కులు తక్కువగా వచ్చాయని ఆత్మహత్యా ప్రయత్నాలు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. ప్రచారం ఆర్భాటంలో ఉన్న శ్రద్ధ ఫలితాల విడుదలలో చూపలేదు. చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా 66,363 మంది విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేస్తే.. ఫెయిలైన 11,000 మంది పైచిలుకు విద్యార్థులు పాసయ్యారు. చాలా మందికి సబ్జెక్టు మార్కుల శాతం భారీగా పెరిగాయి. ప్రభుత్వం తప్పుడు ఫలితాలు ఇవ్వడం వల్ల చాలామంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు కూడా కోల్పోయారని వాపోయారు.

నాడు పండగైన సేద్యం.. నేడు దండగైంది!

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుకు 'భరోసా'
- అడుగడుగునా అన్నదాతకు అండగా జగన్
- కూటమి ఏడాది పాలనలో కర్షకుల్లో కానరాని సంతోషం



ఖరీఫ్ పంటల సాగుకు దుక్కిచేస్తున్న రైతు

సాక్షి, పార్వతీపురం మన్యం:

జిల్లాలో అధికమందికి వ్యవసాయమే జీవనాధారం. ప్రధానంగా ఖరీఫ్ సీజన్‌పైనే రైతులు ఆధారపడతారు. సీజన్ ఆరంభంలో విత్తనాల కొనుగోలు, నారుమడుల తయారీకి పెట్టుబడులు అవసరమవుతాయి. రైతు ఏ దశలోనూ ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్రమం తప్పకుండా వైఎస్సార్ రైతు భరోసా- పీఎం కిసాన్ పథకం కింద ఏటా మూడు విడతల్లో రూ.13,500 చొప్పున అందించింది. ఏటా ఖరీఫ్ పంట వేసే ముందు మే, జూన్ నెలలో రూ.7,500, రెండో విడతగా అక్టోబరులో ఖరీఫ్ పంట కోతకైనా, రబీ అవసరాలకైనా ఉపయోగపడేలా రూ.4 వేలు, మూడో విడతగా ధాన్యం ఇంటికి చేరే వేళ రూ.2 వేలు చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించేవి. జిల్లాలో ఏడాదికి సగటున 1.45 లక్షల మంది రైతులు సుమారు రూ.196.236 కోట్ల మేర లబ్ధి పొందారు. గత ఎన్నికలకు ముందు ఏటా పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని ప్రస్తుత కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇప్పటికి తనవంతుగా పైసా కూడా విదల్చలేదు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద గత గతేడాది జూన్‌లో రూ.22.77 కోట్లు, అక్టోబరులో రూ.22.85 కోట్లు విడుదల చేసింది. ఈ ఏడాది కూడా ఖరీఫ్ సీజన్ మొదలవ్వబోతోంది. రైతుకు ప్రభుత్వం నుంచి భరోసా అయితే దక్కలేదు.

సాగునీటికీ కష్టాలు..



రైతాంగానికి సాగునీటి కష్టాలు తీర్చాల్సిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ప్రాజెక్టుల ఆధునీకీకరణను గాలికొదిలేసింది. బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు చేసి చేతులు దులుపుకొంది. ప్రధాన సాగునీటి వనరైన తోటపల్లి ఆధునికీకరణ పనులు జాప్యం వల్ల గత ఖరీఫ్‌లో శివారు ప్రాంత రైతులు సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈసారీ సాగునీరు అందుతున్న నమ్మకం రైతుకు లేదు. ఇటీవల పాలకొండలో రైతులు ధర్నాలు చేపట్టారు. తోటపల్లి మొత్తం పెండింగ్ పనులకు దాదాపు రూ.700 కోట్లు అవసరం కాగా.. 2024-25 బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.32.84 కోట్లను మాత్రమే విదిల్చింది. జిల్లాలోని వెంగళరాయ, వట్టిగెడ్డ, పెదంకలాం, జంఝావతి తదితర ప్రధాన ప్రాజెక్టుల ఊసే ఎత్తలేదు. మరోవైపు తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలను పెంచబోమని చెప్పిన చంద్రబాబు.. వరుస వడ్డనతో ప్రజలపై భారం మోపారు. విద్యుత్తు చార్జీల భారం వల్ల రైతులూ ఆందోళన చెందుతున్నారు.

నాడు క్రమం తప్పకుండా సున్నా వడ్డీ

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అర్హులైన రైతులకు క్రమం తప్పకుండా సున్నా వడ్డీ అందజేశారు. రూ.లక్షలోపు రుణాలు తీసుకుని గడువులోగా సక్రమంగా చెల్లించిన వారికి సున్నా వడ్డీ మొత్తాన్ని జమ చేసి, రైతులకు అండగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిలిచింది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందేది. 2023 ఖరీఫ్ సీజన్‌లో ఏర్పడిన కరవుతోపాటు.. 2023-24 రబీ సీజన్ ఆరంభంలో మిచాంగ్ తుపానుతో పంటలు కోల్పోయిన రైతులకు పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఒక్క బటన్ నొక్కడం ద్వారా రూ.14.755 లక్షలు అందుకున్నారు. ఇలా ఏటా పంట నష్టపోయిన రైతుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఒక భరోసా లభించేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు.. రైతుకు సాయమేదీ అందడం లేదు. ఇటీవల అకాల వర్షాలకు రైతులు అరటి, నువ్వులు, మామిడి, జీడి తదితర పంటలను నష్టపోయినా.. నిబంధనల కొర్రీతో ఒక్క ఎకరాకూ పరిహారం దక్కలేదు.

'మద్దతు' కంటితుడుపు!



భామినిలో ఓ రైతు వద్ద ఉండిపోయిన పత్తిని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు (ఫైల్)

గత ఏడాది కాలంలో రైతులకు ప్రభుత్వం నుంచి 'మద్దతు' లభించడం లేదు. గత ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో రైతులు దళారులనే ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాధారణ రకం క్వింటా మద్దతు ధర ప్రభుత్వం రూ.2,300 ప్రకటించగా.. రైతులు రూ.1,600 నుంచి రూ.1,800 చొప్పున మధ్యవర్తులకు విక్రయించుకున్నారు. దీనికితోడు అదనంగా కిలోలను దళారులు లెక్కగట్టి తీసుకున్న సందర్భాలున్నాయి. మొక్కజొన్న, జీడి రైతులదీ అదే పరిస్థితి. మన్యం జిల్లాలో గత సీజన్‌లో 14,800 ఎకరాల్లో పత్తి పంట సాగైంది. పంట కొనుగోలులో సీసీఐ తీవ్ర నిర్లక్ష్యం చూపింది. విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం ముచ్చర్లవలసలోని పత్తి జిన్నింగ్ మిల్లు వద్ద కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. జిల్లాలోని పత్తి పండించిన ప్రాంతాల నుంచి అక్కడికి వెళ్లాలంటే సుమారు 150 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఫలితంగా రైతులు గ్రామాల్లోకి వచ్చిన దళారులనే ఆశ్రయించారు. క్వింటా పత్తి మద్దతు ధర రూ.7,100 నుంచి రూ.7,500 వరకు ఉంటే.. వ్యాపారులు రైతుల వద్ద రూ.6,100కే కొనుగోలు చేశారు. క్వింటా వద్ద రూ.వెయ్యి వరకు రైతు నష్టపోయారు. జిల్లాలో భామిని, పాలకొండ, సీతంపేట ప్రాంతాల్లో ఎక్కువగా పత్తి సాగులో ఉంది. రైతులను ఆదుకుంటామని అధికారులు చెప్పిన మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో..

సాగునే నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతుకు ప్రతి అడుగులోనూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తోడుంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు అందజేయడమే కాక.. పంటలకు గిట్టుబాటు కల్పించింది. పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి, నష్టపోకుండా వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా రూ.13,500 సహాయం క్రమం తప్పకుండా అందించేది. వైఎస్సార్ పంట రుణాల సున్నా వడ్డీ పథకం కింద ఖరీఫ్, రబీలో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులకు వడ్డీ మొత్తం జమ చేసేది. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ మొత్తాన్ని అందించి ఆదుకునేది.

కూటమి ప్రభుత్వ పాలనలో..

ఏడాది పాలనలో రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం నిలువునా ముంచింది. అధికారంలోకి రాకముందు ఓట్ల కోసం హామీలను గుప్పించి.. ఇప్పుడు వెన్నుచూపింది. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్‌లు గడిచినా పెట్టుబడి సాయం లేక.. నష్టపోయిన పంటలకు పరిహారం అందక.. ఆరుగాలం శ్రమించి, పండించిన పంటకు 'మద్దతు' దక్కక రైతులు తీవ్ర క్షోభకు గురవుతున్నారు.

పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి..



ఏటా పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి. రైతులకు ఆ మేరకు మద్దతు దొరకడం లేదు. సాగుసాయం అందడం లేదు. ఇటీవల కేంద్ర క్యాబినెట్ సమావేశంలో పంటలకు మద్దతు ధరలు ప్రకటిస్తూ వరికి క్వింటాకు కేవలం రూ.69 పెంచింది. ఈ మాత్రానికే భారీగా పెంచామనడం సమంజసం కాదు. ఇది ఏ మాత్రం సరిపోదు. క్వింటా ధాన్యాన్ని రూ.3 వేలు చేయాలి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూడా ఇతర రాష్ట్రాల వలే బోనస్‌గా రూ.500 ప్రకటించాలి. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని మండలాల్లో రైతులు పంటలను కోల్పోయారు. నిబంధనల పేరుతో పరిహారం కూడా దక్కకుండా చేస్తున్నారు. ఇది అన్యాయం.

– బుడితి అప్పలనాయుడు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

నిర్లక్ష్యం తగదు

తోటపల్లి ఆధునికీకరణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. పాలకొండ, వీరఘట్టం, జియ్యమ్మ వలస మండలాల్లోని సుమారు 30 గ్రామాల పరిధిలోని తోటపల్లి ప్రాజెక్టు ఆయకట్టు వేలాది ఎకరాలకు సాగునీరు అందడం లేదు. కాలువల్లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టడం, సిల్ట్ తీయకపోవడం వల్ల శివారు భూములకు సాగునీరు సరఫరా కావడం లేదు. ఇటీవల బడ్జెట్లో విడుదల చేసిన నిధులు ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోవు. ఈ ఏడాది ఇంతవరకు కాలువల పనులే ప్రారంభించలేదు. అంటే ఈ ఏడాది కూడా నీరు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

– ఎం.కృష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో వైఎస్సార్ భరోసా కింద ఏడాదికి లబ్ధిపొందే రైతులు (సుమారుగా)	ఆర్థిక లబ్ధి (ఏడాదికి)	కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రైతుకు అందజేసిన పెట్టుబడి సాయం	తోటపల్లి మొత్తం పెండింగ్ పనులకు అవసరమైన మొత్తం దాదాపు	కూటమి ప్రభుత్వం 2024-25 బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం
1.45 లక్షల మంది	రూ. 196.236 కోట్లు	0	రూ. 700 కోట్లు	రూ. 32.84 కోట్లు

ఏడాది కూటమి పాలనలో... అభివృద్ధి, సంక్షేమం శూన్యం



వెన్నుపోటు దినం వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నాయకులు

- జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు ధ్వజం
- రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది
- ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెట్టడం తప్ప ప్రజలకు చేసినదేమీ లేదు
- సూపర్‌సిక్స్ హామీలను గాలికి వదిలేశారు
- ఏడాదిలో లక్షా 50 వేల కోట్లు అప్పు చేసినా పథకాలు అందజేయని వైనం
- జూన్ 4న ఉమ్మడి విజయనగరం జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లో 'వెన్నుపోటు దినం' నిర్వహణ



కూటమి ప్రభుత్వ పాలనా వైఫల్యాలను వివరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మెరకముడిదాం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా జిల్లాలో చేసిన అభివృద్ధి, సంక్షేమం శూన్యమని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమ పోస్టర్లను మెరకముడిదాంలో స్థానిక నాయకులతో కలిసి శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆదేశాల మేరకు ఉమ్మడి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లోనూ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, నాయకుల ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ తీరుపై నిరసన తెలియజేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగా ప్రతిపక్ష పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలపై అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో ఒక్క హామీ కూడా అమలు చేయలేకపోయారని మండిపడ్డారు. ఏడాది కాలంలో లక్షా 50 వేల కోట్లు అప్పు చేసినప్పటికీ రాష్ట్రంలో ఒక్క సంక్షేమ పథకం, అభివృద్ధి పని చేపట్టలేదని, అప్పు చేసిన డబ్బులు ఎక్కడకు వెళ్లాయని ప్రశ్నించారు. రైతుల పంటల సాగుకు భరోసా లేదు, చదువుతున్న చిన్నారులకు తల్లికి వందనం లేదు.. మహిళలకు ఉచిత బస్సును సైతం తుస్సుమనిపించారని విమర్శించారు. ఒక్కపథకమూ అమలుచేయలేక, ప్రజలకు మోహాలు చూపించలేక నియోజకవర్గాల్లో కూటమి నేతలు తిరగడం మానేశారన్నారు. ప్రజల కష్టాలను గాలికి వదిలేశారని, కనీసం సమావేశాలకు కూడా రాకుండా మోహంచాటేస్తున్నారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల పిల్లల విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యమిచ్చిందని, నాడు-నేడు పనులతో పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన కింద ఆర్థిక సాయం అందించిందన్నారు. నేడు పనులు చేసినా బిల్లులు అందడం లేదంటూ కూటమికి చెందిన నాయకులే గగ్గోలు పెడుతున్నారన్నారు. పదోతరగతి ఫలితాల ప్రకటనలో వైఫల్యానికి విద్యాశాఖ మంత్రి లోకేశే కారణమన్నారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసిన ఫెయిలైన 11వేల మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారంటే పరీక్ష పత్రాల మూల్యాంకనంపై ప్రభుత్వ చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చన్నారు. అన్ని రంగాల్లో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, పప్పల కృష్ణమూర్తి, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు బోనెల గోపి, సత్తారు శ్రీనివాసరావు, టి.వర్మరాజు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పార్వతీపురంలో పండగ శోభ

- నేటి నుంచి ఇప్పలపోలమ్మ, ఎర్రకంచమ్మ, బంగారమ్మల జాతర
- నాలుగు రోజులపాటు నిర్వహణ
- పట్టణ సమస్యల పరిష్కారంలో మున్సిపల్ యంత్రాంగం వైఫల్యం
- వెంటాడుతున్న తాగునీరు, విద్యుత్ సమస్యలు
- ట్రాఫిక్ మళ్లింపునకు పోలీసుల ఏర్పాట్లు



ఇప్పలపోలమ్మ అమ్మవారు



ఎర్ర కంచమ్మ



బంగారమ్మతల్లి

పార్వతీపురంటౌన్: పార్వతీపురానికి పండగ శోభ వచ్చింది. గ్రామదేవతలైన ఇప్పలపోలమ్మ, ఎర్రకంచమ్మ, బంగారమ్మ గ్రామదేవతల జాతరకు వేళయింది. ఆదివారం నుంచి బుధవారం వరకు నాలుగు రోజుల పాటు సాగే జాతరలో అమ్మవార్లకు మొక్కులు చెల్లించేందుకు ఆంధ్రా, ఒడిశా నుంచి భక్తులు తరలివస్తారు. మొక్కుబడులు చెల్లిస్తారు. ఏజెన్సీకి ముఖద్వారంగా ఉండే పార్వతీపురంలో జరిగే జాతరలో ఉత్సాహంగా పాల్గొంటారు. జిల్లా ఏర్పడిన తరువాత 2023లో జాతరను వైభవంగా నిర్వహించారు. ప్రస్తుతం ఆ స్థాయి ఏర్పాట్లు కనిపించడం లేదన్నది భక్తుల మాట. తాగునీరు, విద్యుత్, ట్రాఫిక్ సమస్యలు పట్టణ ప్రజలకు సవాల్‌గా మారాయి.

విద్యుత్ అలంకరణ

పట్టణ ప్రధాన రహదారి సారికి వీధి నుంచి పాత బస్టాండ్ వరకు విద్యుత్ దీపాలను అలంకరించారు. వైకేఎం కాలనీ, బంగారమ్మ కాలనీలో విద్యుత్ అలంకరణ అందరినీ ఆకర్షిస్తోంది. ఉత్సవాలకు వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు పట్టణంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.

పోలీసుల కసరత్తు

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అల్లరి మూకలు, సంఘ వ్యతిరేక శక్తులు కదలికలపై నిఘా పెంచారు. ఉత్సవాల విజయవంతానికి ప్రజలు సహకరించాలని కోరారు. సారా, అక్రమ మద్యం రవాణా నియంత్రణకు ఎక్సైజ్ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టింది. పోలీసు శాఖ పట్టణంలో ముమ్మర తనిఖీలతోపాటు హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసింది.

ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు

జిల్లా కేంద్రంలో నిర్వహించే జాతరలో భాగంగా మంగళవారం ఇప్పలపోలమ్మ, ఎర్రకంచమ్మ గ్రామ దేవతలకు సంబంధించిన రెండు సిరిమానులు తిరుగుతాయి. పార్వతీపురం పట్టణానికి ప్రధాన బైపాస్ రోడ్డు లేకపోవడం, ఉన్న బైపాస్ రహదారిలో కేవలం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ప్రధాన రహదారిపై పాలకొండ, రాయగడ, కూనేరు, కురుపాం, కొమరాడ మండలాలకు వెళ్లే బస్సుల దారి మళ్లింపునకు పోలీసు సిబ్బంది చర్యలు చేపట్టారు. సిరిమాను తిరిగే సమయంలో ట్రాఫిక్‌ను అదుపు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు.

తాగునీరు అందేనా..

పట్టణ ప్రజలను తాగునీటి సమస్య వెంటాడుతున్నా పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టడం లేదని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ప్రస్తుతం నాలుగు రోజులకోసారి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. పండగ నాలుగు రోజులు ఇదే ఒరవడి కొనసాగితే తీవ్ర ఇబ్బందులకు గురవుతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తోటపల్లి రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేస్తామని మున్సిపల్ అధికారులు చెబుతున్నా ఆచరణలో సాధ్యం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం విద్యుత్ లైన్ల నిర్వహణ, చెట్టుకొమ్మలు కొట్టడం వంటి కారణాలతో వారంలో మూడు రోజులు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. సిరిమానులు తిరిగే సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం సహజమే. ప్రస్తుతం పండగ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ క్లియరెన్స్‌ల పేరిట మూడు రోజులుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. కనీసం పండగ సమయాల్లోనైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పండగ సాగేదిలా..

జాతర మొదటి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఉయ్యాల-కంబాల కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. రెండవ రోజు సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం అమ్మవార్ల ఘటాలు, సిరిమాను ఊరేగింపులు సాగుతాయి. బుధవారం ఘటాల అనుపోత్సవం ఉంటుంది. ఉత్సవాల నాలుగు రోజులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.



విద్యుత్ దీపాల అలంకరణలో పార్వతీపురం పట్టణం



పార్వతీపురం పట్టణంలో ఘటాల తిరువీధి

క్లుప్తంగా

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో రూ.4.90 లక్షల జరిమానా



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

విజయనగరం క్రైమ్: మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన వారికి రూ.10వేల జరిమానా విధిస్తున్నట్టు ఎస్పీ వకుల్ జిందల్ శనివారం తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో విజయనగరం ట్రాఫిక్ సీఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 49 మందిపై ఒక్క రోజులోనే కేసులు నమోదు చేసి విజయగరం అడిషనల్ జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ ఎంఎస్‌హెచ్ఆర్ తేజ చక్రవర్తి ఒకొక్కరికి రూ.10వేల చొప్పున మొత్తం 49 మందికి రూ.4.90 లక్షల జరిమానా విధించారని ఎస్పీ తెలిపారు.

ప్రశాంతంగా ఎస్‌జీటీల కౌన్సెలింగ్



బదిలీ ఉత్తర్వులు అందజేస్తున్న పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్‌శంకరన్ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, జీపీఎస్ ఉపాధ్యాయులకు బదిలీల కౌన్సెలింగ్ శనివారం జరిగింది. ఎస్‌జీటీ 37, ఎల్‌పీ తెలుగు, ఎల్‌పీ హిందీ పోస్టులు ముగ్గురికి చొప్పున బదిలీ చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఏపీవో చిన్నబాబు, ట్రైబుల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, ఏటీడబ్ల్యూవో మంగవేణి, ఏఎంవో కోటిబాబు, సీఎంవో చిరంజీవి, జీసీడీవో రాములమ్మ, హెచ్‌ఎంలు పి.నారాయుడు, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ డిపోల వద్ద సరుకులు



సిబ్బందితో మాట్లాడుతున్న జీసీఎంఎస్ మేనేజర్ సాంబశివరావు

పార్వతీపురం టౌన్: నేటి నుంచి రేషన్ డిపోల వద్ద సరుకులు పంపిణీ చేయనున్నట్టు జీసీసీ మేనేజరు ఎం.సాంబశివరావు అన్నారు. ఈ మేరకు శనివారం సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జీసీఎంఎస్ బ్రాంచి పరిధిలో 17 డిపోల సేల్స్‌మెన్స్, గోదాముల సూపర్‌వైజర్‌ల్ ఆదివారం నుంచి ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు తెరిచి వుంచాలన్నారు. వినియోగదారులకు ఇటువంటి అసౌకర్యాలు కలగకుండా పంపిణీ చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందికి హెచ్చరించారు. జీసీఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


ఆటో బోల్తా..



బోల్తా పడిన ఆటో

శృంగవరపుకోట: మండలంలోని గిరిశిఖర పంచాయతీ ధారపర్తి పరిధిలో పల్లపు దుంగాడ నుంచి దబ్బగుంటకు వెళ్తున్న ఆటో బోల్తా పడింది. శనివారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటుచేసుకుంది. అయితే ఈ సమయంలో ఆటోలో ప్రయాణికులెవ్వరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో నుజ్జయిన ఆటో

విజయనగరం క్రైమ్: నగరంలోని ఫూల్ బాగ్ రోడ్డులో అయ్యప్పస్వామి గుడి వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. చీపురుపల్లి నుంచి విజయనగరం వస్తున్న కారు పూల్‌బాగ్ రోడ్డులో అయ్యప్ప స్వామి గుడి వద్ద వెనుక నుంచి వస్తూ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో రావివలస పంచాయతీకి చెందిన ఆటో డ్రైవర్ రామకృష్ణ మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు టు టౌన్ ఎస్ఐ కృష్ణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

నిఘా పెంచి మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట వేయాలి

- క్యూఆర్ కోడ్‌తో సమాచారం
- జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: జిల్లాలో మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నిఘా పెంచాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. జిల్లా మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిఘా అధికం చేయడం మాత్రమే కాకుండా వాహనాలను ఆకస్మిక తనిఖీలను చేపట్టడం వలన మరింత ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలో మున్సిపాలిటీలు కనీసం 5వందల సీసీ కెమెరాలు సమకూర్చాలని ఆయన అన్నారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు 1972 టోల్ ఫ్రీ నంబరుకు అందించాలని కోరారు. ఆర్టీసీ బస్సులలో మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించి వివరాలతో అవగాహన పోస్టర్లను పెట్టాలన్నారు. అటవీ శాఖ అధికారులు ఆధునిక పరిజ్ఞానంతో అటవీ ప్రాంతంలో జరిగే మాదకద్రవ్యాల నియంత్రణ కార్యక్రమంలో పటిష్ట చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

క్యూఆర్ కోడ్‌లతో సమాచారం

క్యూఆర్ కోడ్‌లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చి మాదక ద్రవ్యాల సమాచారంపై ప్రజల స్పందన కూడా తెలుసుకోవడం జరుగుతుందని వివరించారు. ఈ మేరకు 21 పోలీస్‌స్టేషన్ల పరిధిలో 7841 మంది ప్రజలు పాల్గొని స్పందన అందించారన్నారు. డ్రోన్ సర్వేలను నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు స్వయం రక్షణ పద్ధతులు నేర్పించడం, పాఠశాలల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక క్లబ్బులను ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. జనవరి నుంచి మే వరకు మాదక ద్రవ్యాలకు సంబంధించి 11 కేసులను నమోదు చేశామని, ఇందులో 1875 కేజీల గంజాయి రవాణా చేయడం జరిగిందన్నారు. రవాణా శాఖ అధికారి ఎం.శశికుమార్ మాట్లాడుతూ రవాణా శాఖ వాహనాల తనిఖీలు నిర్వహిస్తుందని, 199 కేసులను బుక్ చేయడం జరిగిందని చెప్పారు. ఎక్సైజ్ శాఖ అధికారులు మాట్లాడుతూ జిల్లాలో నవోదయం రెండవ దశ పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. 27 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా ప్రకటించామన్నారు.

సంయుక్తంగా దాడులు

ఆంధ్రా – ఒడిశా అధికారులు సంయుక్తంగా దాడులను నిర్వహించడం జరిగిందని, ఇందులో 50 వేల ఐదు వందల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేయడం జరిగిందని తెలిపారు. సారా తయారీకి సహకరిస్తున్న 64 మంది బెల్లం వ్యాపారులను గుర్తించామని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, ఏఎస్పీ అంకిత సురాన, పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి గయాజుద్దీన్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం వినోద్, పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, అటవీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ వివరాలపై ప్రతీ నివేదిక అందజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అంబేడ్కర్

- జిల్లా కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: స్కానింగ్ కేంద్రాల్లో ప్రతి రోజూ ఎన్ని స్కానింగ్‌లు జరుగుతున్నాయనే అంశంపై ప్రతీ రోజు నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో శనివారం లింగ నిర్ధారణ నిరోధక చట్టం అమలుపై జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో రోజు వారీగా జరుగుతున్న ప్రసవాలను నమోదు చేసి ఆయా ఆసుపత్రుల నుంచి ప్రతి రోజు సమాచారం సేకరించే వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో జరిగిన గర్భస్రావాల సమాచారం కూడా వెంటనే అందజేయాలన్నారు. ఏప్రిల్ నెలకు సంబంధించి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో జరిగే ప్రసవాల సమాచారాన్ని వెంటనే ఒక నివేదిక రూపంలో అందజేయాలన్నారు. అన్ని స్కానింగ్ కేంద్రాల్లోనూ లింగ నిర్ధారణ సమాచారం తెలియజేయడం జరగదనే బోర్డులు సందర్శకులకు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. స్కానింగ్ కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు ఆయా ఆసుపత్రులు వసూలు చేసే చార్జీల వివరాలతో కూడిన ధరల పట్టికను కూడా బోర్డుల రూపంలో ప్రదర్శించే ఏర్పాట్లు చేయాలన్నారు. స్కానింగ్ కేంద్రాలపై వైద్య ఆరోగ్య శాఖ పూర్తి స్థాయిలో నియంత్రణ ఉండాలని స్పష్టం చేశారు. కొత్తగా స్కానింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ఆయా రెవెన్యూ డివిజనల్ అధికారులు తనిఖీ చేసిన నివేదిక ఇచ్చిన తర్వాతే వాటికి అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.జీవనరాణి, డీఎల్‌వో డాక్టర్ కె.రాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సూర్యనారాయణ, ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ సుబ్రమణ్యం, డీఐవో డాక్టర్ ఆర్. అచ్చుతకుమారి, డీపీహెచ్‌ఎన్‌వో సత్యవతి, డెమో చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాపై నిఘా పెట్టాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో సవరమ్మ

- విజయనగరం ఆర్డీవో టి.సవరమ్మ

విజయనగరం అర్బన్: పశువుల అక్రమ రవాణాపై అధికారులు నిఘా పెట్టి కేసులు నమోదు చేయాలని విజయనగరం ఆర్డీవో టి.సవరమ్మ ఆదేశించారు. తన కార్యాలయంలో డివిజన్ జంతు సంక్షేమ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లొట్లపల్లి, మోపాడ జంతువులు మరియు పశువుల సంతల్లో పశువులను హింసాత్మకంగా అక్రమ రవాణా జరుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సంతకు లైసెన్స్ లేకపోయిన అక్రమంగా సంత నిర్వహిస్తున్నట్టు దీనిపై అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ మాట్లాడుతూ విజయనగరం పట్టణంలో పశువధశాల లేకపోయినా పశు మాంస వ్యాపారాలు చేసుకునేందుకు లైసెన్స్‌లు ఇచ్చిన మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం గో సంరక్షణ క్యాలెండర్‌ను ఆర్డీవో ఆవిష్కరించారు. సమావేశంలో డివిజనల్ పంచాయతీ అధికారి ఆరికతోట మోహనరావు, పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ధర్మారావు, పి.అనురాధ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె.చంద్రశేఖర్‌రావు, డివిజన్ పరిధిలో మండలాధికారులు, గో సంరక్షణ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

'గురుదేవా'లో చోరీ ఇంటిదొంగల పనేనా..?

- ఇప్పటికే అదుపులో ఐదుగురు అనుమానితులు



కొత్తవలస పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీఎస్పీ, సీఐలతో మాట్లాడుతున్న ఏఎస్పీ సౌమ్యలత

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష బాబు ఇంట్లో మంగళవారం రాత్రి భారీ చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఇంటి దొంగలే చోరీకి పాల్పడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ దొంగతనం జరిగిన ఇంటి పూజాగది, పరిసరాలను శుక్రవారం పరిశీలించారు. డీఎస్పీ, సీఐ, ఎస్ఐలతో రెండున్నర గంటల పాటు చర్చించి పలు సూచనలు చేశారు. దొంగతనం జరిగిన ఇంటి ముందు ఉన్న సీసీ కెమెరా దొంగతనం జరిగిన రోజు సాయంత్రం 6 గంటలకు ఆగిపోవడం, కెమెరాకు సంబంధించిన వైరు తెగిపోయి ఉండడాన్ని చూసి.. అక్కడ నుంచే దర్యాప్తును ప్రారంభించారు. ట్రస్టులో పని చేస్తున్న ఐదుగురు వ్యక్తులను శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకుని విచారణ జరపగా చోరీ చేసిన తీరును తెలిపినట్టు సమాచారం. చోరీకి గురైన సొత్తును స్వాధీనం చేసుకునేందుకు పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు. చోరీ అంతా ట్రస్టులో పనిచేసే ఒక బిగ్‌బాస్ ఆధ్వర్యంలో జరిగినట్టు అనుమానిస్తున్నారు. ఏఎస్పీ సౌమ్యలత ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందం శనివారం సాయంత్రం మరింత లోతుగా దర్యాప్తు చేసింది.

అసలు చోరీకి గురైన బంగారం ఎంత?

జగదీష్‌బాబు ఇంట్లో జరిగిన చోరీలో ఎంత మొత్తంలో బంగారాన్ని దొంగలు అపహరించుకుపోయారనే విషయంలో స్పష్టతలేదు. పోలీసులు మాత్రం కేవలం 90 తులాల బంగారం, రూ.5 లక్షల నగదు పోయినట్టు కేసు నమోదు చేశారు. వాస్తవానికి అంతకు 10 రెట్లు బంగారం, పెద్ద మొత్తంలో నగదును దోచుకుపోయారన్న వాదన వినిపిస్తోంది. డీఐజీ, ఎస్పీ స్థాయి అధికారులు దర్యాప్తును పర్యవేక్షించడం ఈ వాదనకు బలం చేకూరుతోంది.

పరామర్శ..



సీతారామరాజును పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం ఎంపీటీసీ సభ్యుడు ఎస్.సీతారామరాజు ఇటీవల ఇంట్లో ప్రమాదవశాత్తూ పడిపోయి గాయపడ్డారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మజ్జి శ్రీనివాసరావు శనివారం గ్రామానికి చేరుకుని పరామర్శించారు. ఈ సందర్భంగా సీతారామరాజుతో మాట్లాడుతూ.. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌వీ రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి వేధింపులపై పెళ్లికుమార్తె ఫిర్యాదు

విజయనగరం క్రైమ్: ఆమెకు ఈ నెల 5వ తేదీన వివాహం జరిపేందుకు పెద్దలు నిశ్చయించారు. ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. గతంలో తను పనిచేసే షాపులో సహోద్యోగి తనను పెళ్లిచేసుకోవాలంటూ స్నేహితులతో కలిసి శనివారం రాత్రి ఇంటివద్ద గొడవచేశారు. దీనిపై తల్లిదండ్రులతో కలిసి విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో పెళ్లికుమార్తె శనివారం ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ మీనాక్షి కేసు నమోదు చేశారు. స్థానికంగా ఉన్న ఓ షాపులో తనతో కలిసి వీటీ అగ్రహారానికి చెందిన అబ్బాయి పనిచేసేవాడని, దానిని అనువుగా తీసుకుని పెళ్లి చేసుకోవాలంటూ వేధిస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏఎస్ఐ మీనాక్షి దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరి మృతి

- మృతులిద్దరూ ఒకే కుటుంబానికి చెందిన గిరిజనులు



గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన అప్పన్న, రమేష్

పార్వతీపురం రూరల్: మండలంలోని డీకే పట్నం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పీడిక అప్పన్న (55), ఊయక రమేష్ (25) మృతి చెందారు. మృతులిద్దరూ ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు. ఈ ప్రమాదానికి సంబంధించి పార్వతీపురం రూరల్ ఎస్ఐ బి.సంతోషికుమారి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సందివలస గ్రామానికి చెందిన పీడిక అప్పన్న అల్లుడు వరుసైన ఒడిశాలోని కార్లి గ్రామానికి చెందిన రమేష్‌తో ద్విచక్ర వాహనంపై సంధివలస నుంచి సొంత పనుల నిమిత్తం వేరే గ్రామానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గుర్తు తెలియని వాహనం డీకే పట్నం సమీపంలో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఘటనా స్థలం వద్ద రమేష్ మృతి చెందగా, డోకిశీల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతూ పీడిక అప్పన్న మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించినట్టు ఆమె తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

తప్పిన ప్రమాదం



బోల్తాపడిన నూర్పిడి యంత్రం

వంగర: మండల పరిధి మగ్గూరు కూడలి వద్ద శనివారం పెనుప్రమాదం తప్పింది. వరి నూర్పిడి అనంతరం కళ్లం నుంచి గ్రామంలోకి తీసుకువస్తున్న నూర్పిడి యంత్రం ఒక్కసారిగా బోల్తాపడింది. దీనిపై కూర్చున్న వేతనదారులు ప్రమాదాన్ని అంచనా వేసి దూకేయడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించ లేదు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం రోడ్డుపై బోల్తాపడిన నూర్పిడి యంత్రాన్ని జేసీబీ సహాయంతో సరిచేశారు.

విక్రంపురంలో గంజాయి కలకలం..!

- తొమ్మిదేళ్ల బాలుడిపై దాడి



మండల పరిషత్ పాఠశాల ఆవరణలో మత్తులో చిందులు వేస్తున్న యువకుడు

కొమరాడ: మండలంలోని విక్రంపురం గ్రామ సచివాలయం, జిల్లా పరిషత్ పాఠశాల, మండల పరిషత్ పాఠశాల పరిసరాల్లో మందుబాబులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పాఠశాలలకు సెలవులు కావడంతో మందుబాబులు మరింత రెచ్చిపోతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మండల పరిషత్ పాఠశాల వద్ద కొందరు యువకులు మద్యంతో పాటు గంజాయి సేవిస్తూ గ్రామస్తులకు పట్టుబడ్డారు. సిరిపురం గౌతమ్ అనే యువకుడు తొమ్మిదేళ్ల బాలుడిపై గంజాయి మత్తులో దాడి చేశాడు. బాలుడి కుటుంబ సభ్యులు గౌతమ్‌ను ప్రశ్నించగా వారిపై ఇటుక రాళ్లతో దాడికి దిగాడు. దీనిపై ఆరా తీయగా ఆ యువకుడు తెల్లవారి నుంచే మద్యంతో పాటు గంజాయి సేవిస్తూ ఇష్టారాజ్యంగా గ్రామంలో తిరుగుతూ ఎవరు ప్రశ్నిస్తే వారిపై దాడి చేయడం అలవాటైందని గ్రామస్తులు చెబుతున్నారు. ఆ యువకుడితో పాటు గ్రామానికి చెందిన పలువురిని గంజాయికి బానిస చేస్తున్నాడని యువత తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా గౌతమ్ ఆగడాలు గ్రామంలో రోజురోజుకు పెరిగిపోతున్నాయని పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా బాలుడి తల్లిదండ్రులు ఈ విషయమై పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు.

విధుల్లో అంకితభావంతోనే గుర్తింపు : ఎస్పీ



పదవీ విరమణ పొందిన ఎస్ఐకు జ్ఞాపికను అందజేస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: పోలీసు శాఖలో ఉన్నతాధికారులు వివిధ రూపాల్లో తమ విధుల్లో నైపుణ్యత చూపి చేసిన సేవలు చిరస్థాయిగా పలువురికి ఆదర్శంగా, ఆచరణీయంగా ఉంటూ పదిలంగా ఉంటాయని ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి పేర్కొన్నారు. తన కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన మెట్ట సుదర్శన వెంకటప్రసాద్‌ను శనివారం ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 40ఏళ్ల పాటు సుదీర్ఘ సేవలందించి, శాఖపై ప్రజలకు మరింత భరోసా కల్పించిన వారి గుర్తింపు చిరస్థాయిగా ఉంటుందని ఎస్పీ అన్నారు. పోలీసు శాఖ వారి కుటుంబానికి అవసరమైనపుడు ఆదుకొనేందుకు సిద్ధంగా ఉంటుందని అన్నారు. పదవీ విరమణ పొందిన ఎస్ఐకు ఎస్పీ చేతుల మీదుగా జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఏఆర్ఐలు రాంబాబు, నాయుడు, ఎస్పీ ఎస్ఐ దినకర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులకు విఘాతం కలిగిస్తే చర్యలు



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ

పార్వతీపురం: బాలల హక్కులకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ టి.కనకదుర్గ అన్నారు. పట్టణంలో సౌందర్య థియేటర్ రోడ్డులో బాల్య వివాహాలను నిర్మూలించడానికి, బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రజలకు మరింత అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రచార రథాన్ని శనివారం ఆమె పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కుల రక్షణ కోసం ప్రజలను చైతన్య పరచడం జరుగుతుందన్నారు. బాలల హక్కుల రక్షణ మిషన్(ఎన్‌సీపీసీఆర్), రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్(ఎస్సీపీసీఆర్) గూర్చి ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. ఈ ప్రచార రథం బాలల హక్కుల రక్షణ కోసం ఒక అవసరమైన సాధనంగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీపీవో అల్లు సత్యనారాయణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా, డెంగీ నివారణకు చర్యలు : పీవో



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవోఅశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలో మలేరియా, డెంగీ కేసులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టి నివారించే విధంగా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో జిల్లా వైద్యాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజన ప్రాంతాల్లో మలేరియా, డెంగీ కేసులు ఉండరాదని, వాటి నివారణకు పూర్తి చర్యలు తీసుకోవాలని, అలాగే పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థులందరికీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఐఎంఆర్, ఎస్ఎంఆర్ మరణాల రేటును తగ్గించేలా జాగ్రత్తలు తీసుకోవాలని పీవో తేల్చి చెప్పారు. ఈ విషయంలో వైద్యాధికారులందరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.ఎస్.భాస్కరరావు, ఉప జిల్లా వైద్యశాఖాధికారి కేవీఎస్ పద్మావతి, జిల్లా మలేరియా అధికారి వై.మణి, ప్రోగ్రాం ఆఫీసర్ డా. ఎం.వినోద్‌కుమార్, ఐటీడీఏ పరిధిలో వున్న మండలాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఒకరికి జైలు శిక్ష..

బొండపల్లి: మండలంలోని బిల్లలవలస గ్రామ సమీపంలో జాతీయ రహదారి 26పై నిర్లక్ష్యంగా లారీ నడిపి ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు మృతికి కారణమైన లారీ డ్రైవర్ వై. శ్రీనివాసరావుకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ జిల్లా న్యాయమూర్తి శనివారం తీర్పు చెప్పారని ఎస్సై యు. మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జైలు శిక్షతో పాటు పది వేల రూపాయల జరిమాన విధించారని పేర్కొన్నారు.